క్లుప్తంగా

టిప్పర్ బోల్తా



ఎగువశోభ రహదారిలో బోల్తాపడిన టిప్పర్

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ రహదారిలోని సరపోదోర్ పూలుగుడ గ్రామ సమీపంలోని మలుపు వద్ద రహదారి మెటీరియల్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఎగువశోభ పంచాయతీ సమీపంలోని రహదారి పనుల నిమిత్తం మైదాన ప్రాంతం నుంచి భీనుపురం మీదుగా ఎగువశోభ వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలోని ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, మాజీ మంత్రి బాలరాజు, భక్తులు

జి.మాడుగుల: పాడేరు మోదకొండమ్మతల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజుతో పాటు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీకి చేసిందన్నారు. ఉత్సవంలో భాగంగా స్థానికులతో పాటు అనేక జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఈ ప్రాంతం సుభిక్షంగా విరజిల్లాలని పూజలు చేసినట్టు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



ప్రతాప్

కూనవరం: సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం అల్లూరి జిల్లా కన్వీనర్‌గా కూనవరం మండలం, పోచవరం గ్రామానికి చెందిన పల్లంటి ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల సంఘం అధ్యక్షుడు జి.ముత్తు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రజలందరు సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి వ్యక్తి తనకు కావలసిన సమాచారాన్ని అధికారుల నుంచి తెలుసుకోవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మాష్టమి

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలోని శ్రీనివాసుని ఆలయంలో ఆదివారం భీష్మాష్టమి కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవనగిరి క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసునికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య మాట్లాడుతూ భీష్ముడు అంపశయ్యపై మీద ప్రాణత్యాగం చేసిన రోజు కావడంతో భీష్మాష్టమికి ప్రత్యేకత ఉందన్నారు. ఆ మహాత్ముని తలుచుకుంటూ మూడు దఫాలు దోసిళ్లతో నీటిని విడవడం సంప్రదాయంగా శాస్త్రాలు చెబుతున్నట్టు పేర్కొన్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం సూర్యనారాయణ స్వామి నోములు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నోములు చేసుకున్న భక్తులు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమాన్నం తయారు చేసి భక్తులకు పంచిపెట్టారు. దీనిలో భాగంగా పలు రకాల సామాగ్రిని జారు విసిరారు. వాటిని పట్టుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.

అటవీ ఉత్పత్తులు.. ఆదాయ వనరులు

- ముషిణి గింజలకు గిరాకీ
- గిట్టుబాటు ధరతో జీసీసీ కొనుగోలు
- ఆనందంలో గిరిజనులు



గిరిజనుల నుంచి ముషిణి గింజలు కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది

గంగవరం : ఏజన్సీలో అటవీ ఫలసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతో గిరిజనులు అదనపు ఆదాయాన్ని సాధిస్తున్నారు. ఏటా వ్యవసాయ పనులు లేని కాలంలో చాలా గిరిజన కుటుంబాలు ఈ అటవీ ఉత్పత్తుల సేకరణతో అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తూ జీవనం సాగిస్తారు. వీటిలో ముషిణి కాయల గింజలు సేకరణ ఒకటి. మన్యంలోని అటవీ ప్రాంతాల్లో ఏటా డిసెంబర్ నుంచి మార్చి చివరి వారం వరకు ఈ కాయలు లభిస్తాయి. ఈ ముషిణి చెట్లు అటవీ కొండ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. ముషిణి కాయలను సేకరించి వాటిలో ఉండే గింజలను వేరు చేస్తారు. వేరు చేసిన



ఎండలో ఎండబెట్టిన గింజలు

ముషిణి గింజలను ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఎండలో ఎండబెడతారు. బాగా ఎండి గింజలను విక్రయిస్తారు. ముషిణి కాయలను విరివిగా ఔషధాల్లో వినియోగిస్తుండడంతో మంచి గిరాకీ ఉంది. గిరిజనులు సేకరించిన ముషిణి గింజలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రతి ఏటా కొనుగోలు చేస్తోంది.

పెరిగిన ధరలు

ఈ ఏడాది ముషిణి గింజలకు మంచి గిట్టుబాటు ధర కల్పించడంతో గిరిజనులు ప్రధానంగా గిరిజన మహిళలు ముషిణి గింజల సేకరణలో ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన ముషిణి గింజలను విశాఖపట్నం జీసీసీకి జీసీసీ వారు రవాణా చేస్తున్నారు. ముషిణి గింజలకు గత ఏడాది కంటే ఈ ఏడాది గిట్టుబాటు ధర పెంచడంతో గిరిజనులు వీటి సేకరణలో ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. కుటుంబంలోని అందరూ ముసిణి కాయలు సేకరణకు అటవీ ప్రాంతంలో ముషిణి చెట్లు బాట పడుతున్నారు. గత ఏడాది ముషిణి గింజలు కిలో రూ.32 ఉండగా, ప్రస్తుతం కిలో రూ.55కు జీసీసీ కొనుగోలు చేస్తోంది. దీంతో ముషిణి గింజల సేకరణలో గిరిజనులు నిమగ్నమైయ్యారు.



సేకరించిన ముషిణి కాయలు

అదనపు ఆదాయం

మండలంలో గంగవరం, ఆముదాలబంద, మోహనాపురం, మఠ్రిపాలెం, జడేరు, ఎండపల్లి పంచాయతీల పరిధిలో గల గిరిజన గ్రామాల్లో అటవీ ప్రాంతంలో ముషిణి చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ కొనుగోలు చేసిన ముషిణి గింజలను విశాఖపట్నం జీసీసీకి తరలిస్తాం. ఇప్పటి వరకు మండలంలో సుమారుగా 1500 కిలోల గింజలు కొనుగోలు చేయడం జరిగింది. అటవీ ఉత్పత్తులకు జీసీసీ గిట్టుబాటు ఆశించిన ధరలు కల్పిస్తుండడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

– సీహెచ్.వెంకటేశ్వరరావు, జీసీసీ సేల్స్ మెన్, మఠ్రిపాలెం

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



శెట్టిబందలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొర్రా పంచాయతీలో శెట్టిబంద, పెదపాడు, బుడుమలపుట్టు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శివారు ప్రాంతమైన శెట్టిబంధ గ్రామానికి రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎమ్మెల్యే పాల్గుణ బైక్‌పై ప్రయాణించారు. ఆయా గ్రామాల్లో 180 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. గ్రామాల్లో పర్యటించి, స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరి గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిప్పించి, అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాల అమల తీరుపై అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం చేసినా అటువంటి వారిపై చర్యలుసుకుంటామన్నారు. ఎంపీటీసీ గుజ్జెల విజయ, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, సర్పంచ్‌లు అర్జున్, వెంకటరావు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు, గణపతి, బాలరాజు, శ్రావణ్, మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.బి.సాత్రు తదితరులు పాల్గొన్నారు.

మహా నిర్లక్ష్యం

- నిరుపయోగంగా శిథిల భవనాలు
- ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం
- పరిరక్షించాలంటున్న గ్రామస్తులు



శిథిలావస్థలో విద్యుత్‌శాఖ ఉద్యోగుల క్వార్టర్స్



నిరుపయోగంగా ఉన్న గ్రామచావిడి భవనం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో శిథిల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలకు, రైతు భరోసా కేంద్రాలు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దశాబ్దాల తరబడి ఖాళీగా ఉన్న ఈ స్థలాలను ఉపయోగంలోకి తీసుకొని రావాలన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రాజవొమ్మంగిలో విద్యా శాఖ ఆధ్వర్యంలో దాదాపు 5 ఎకరాల్లో గల ఉద్యోగుల కాలనీ పూర్తి శిథిలావస్థకు చేరి ఆ స్థలాలు నిరుపయోగం మారాయని స్థానికులు చెబుతున్నారు. ఆయా స్థలాలు విషసర్పాలకు నిలయంగా, వ్యర్థాలు, చెత్త పేరుకొనిపోయి అధ్వానంగా ఉన్నాయంటున్నారు. స్థలం కొద్ది కొద్దిగా ఆక్రమణలకు గురవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ నివాసం

మరో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 99 ఉద్యోగుల వసతి గృహాలు (99 క్వార్టర్స్) పూర్తి శిథిలావస్థకు చేరుకోగా కొన్ని గృహాల్లో మాత్రమే ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. ఎప్పుడు కూలిపోతాయో తెలియని ఈ శిథిల భవనాల్లో బిక్కుబిక్కు మంటు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ శిథిల భవనాలను తొలగిస్తే ఆ స్థలం ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఉపయోగపడతాయని స్థానికులు చెబుతున్నారు. స్థానిక గ్రామచావిడి కూడా పూర్తి శిథిలావస్థకు చేరుకోగా అక్కడ గల స్థలం కూడా నిరుపయోగంగా మారిందంటున్నారు. ఈ స్థలం ఇప్పటికే అన్యాక్రాంతం కాగా మిగిలి ఉన్న స్థలాన్నైనా కాపాడాలని కోరుతున్నారు. సొంత భవనం లేక అద్దె ఇంట్లో నడుస్తున్న శాఖా గ్రంథాలయానికి అయినా ఈ స్థలాన్ని కేటాయించాలని, పుస్తక భాండారాన్ని కాపాడాలని పుస్తక ప్రియులు కోరుతున్నారు. రాజవొమ్మంగిలో గల మైనర్ ఇరిగేషన్ కార్యాలయం, ఉద్యోగుల కాలనీ కూడా శిథిలస్థితికి చేరుకుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు, శిథిల భవనాల పరిశీలన

ఖాళీగా ఉన్న భూములు, ప్రభుత్వ భవనాలపై ఆరా తీస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, శిథిల భవనాల విషయంపై పరిశీలిస్తున్నాం. ఆయా స్థలాలు, భవనాలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– సుబ్రహ్మణ్యాచారి, తహసీల్దార్, రాజవొమ్మంగి

రోడ్డు మంజూరుపై గ్రామస్తుల హర్షం



తారురోడ్డు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, చిత్రంలో వైస్ ఎంపీపీ కొండలరావు, సర్పంచ్ చిట్టిబాబు

హుకుంపేట: జర్రకొండ, గేదేలపాడు గ్రామాలకు దశాబ్దాల కళ నేడు సాకరమైందని వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు,సర్పంచ్ కొర్ర చిట్టిబాబు అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన జర్రకొండ, గేదేలపాడు గ్రామాలకు ప్రభుత్వం నూతనంగా రోడ్డు మంజూరు చేయడంపై ఆదివారం గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొండలరావు, సర్పంచ్ చిట్టిబాబుతో పాటు గ్రామపెద్దలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటి వరకు గ్రామంలో రహదారి విషయమై ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో గ్రామానికి రూ.5కోట్లతో తారురోడ్డు మంజూరైనట్లు చెప్పారు. ఏళ్ల నాటి కళ నెరవేర్చిన ప్రభుత్వానికి, రోడ్డు మంజురు చేయడానికి చొరవ తీసుకుని ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్యలింగంనకు స్థానిక గిరిజనులు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

అందుబాటులో సంచార పశు వైద్య సేవలు



పెదబయలు పశువైద్య కేంద్రానికి చేరుకున్న వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్

పెదబయలు: మూగజీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల జెండా ఊపి వాహన సేవలను ప్రారంభించారు. అనారోగ్యంతో ఉన్న మూగ జీవాలు, పెంపుడు జంతువులకు అత్యవసర సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేస్తే సకాలంలో అంబులెన్స్ చేరుకుని సిబ్బంది చికిత్స అందజేస్తారు. ఫిబ్రవరి 1న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అంబులెన్స్‌ను ప్రారంభించనున్నట్టు స్థానిక పశు వైద్య సిబ్బంది తెలిపారు. పశు వైద్య సేవలు అందుబాటులో రావడంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

- విజేతలకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బహుమతులు అందజేత



మొదటి స్థానంలో నిలిచిన కుసుమకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



ముగ్గులు పోటీల్లో పాల్గొన్న యువతులు,మహిళలు

సాక్షి,పాడేరు: పాడేరులో ఆదివారం మోదకొండమ్మతల్లి తీర్థం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పాడేరు ప్రాంతానికి చెందిన సుమారు 80 మంది యువతులు, మహిళలు ఉత్సాహంగా ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొని, రంగురంగుల ముగ్గులు వేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడుతో పాటు న్యాయవాది ప్రసాద్‌నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవితో పాటు గిరిజన ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోటీలను పర్యవేక్షించారు. మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ తరపున నగదు బహుమతులను ప్రకటించగా, సంతూరు సబ్బుల కంపెనీ ప్రతినిధులు ముగ్గుల పోటీలకు అదనంగా పలు సామాగ్రిని బహుమతుల రూపంలో ప్రకటించారు. సంతూరు కంపెనీ తరపున పాడేరు పట్టణానికి చెందిన కుసుమ మొదటి బహుమతిని, పీలా లక్ష్మి రెండవ బహుమతి సాధించారు. అలాగే మూడవ బహుమతితో పాటు కన్సోలేషన్ బహుమతులను కూడా సంతూరు సబ్బుల కంపెనీ ప్రతినిధులు, బూరెడ్డి డిపార్ట్‌మెంటల్ స్టోర్ యాజమాని బూరెడ్డి రాములు సమకూర్చారు. వారితో పాటు ఆలయ కమిటీ మొదటి బహుమతి కింద రూ.6వేలు, రెండో బహుమతి రూ.4వేలు, మూడవ బహుమతి రూ.3వేలతో పాటు మోదకొండమ్మతల్లి చిత్రపటాలను, ప్రత్యేక బహుమతి రూ.1000ను విజేతలకు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అందజేసారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, బీజేపీ నేత కురుసా ఉమామహేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, న్యాయవాది తమర్బ ప్రసాద్‌నాయుడు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లకే నానిపాత్రుడు, టీడీపీ నేత సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి పొందిన ముగ్గు



రెండవ బహుమతికి ఎంపికైన ముగ్గు

గ్రామాల్లో నేడు 'గడప గడపకు'

జి.మాడుగుల: మండలంలోని భీరం గ్రామ సచివాలయం పరిధిలో ఆగంపాడు, వనెర్బ, బొడ్డపుట్టు తుమ్మెదలనేరోడి, వి.కోడాపల్లి, వెంకన్నపాలెం గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గుమ్మకోటలో ...

డుంబ్రిగుడ: అరకు నియోజకవర్గంలోని అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా కాశీపట్నం పంచాయతీ సారవానిపాలెం గ్రామంలో రూ.2.2కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పూడిపల్లిలో...

దేవీపట్నం: దేవీపట్నం మండలం పూడిపల్లి సచివాలయంలో నేలకోట, గండికోట, పి.గొందూరుకాలనీ గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని పార్టీ వర్గీయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు సూరంపాలెంలో...

గంగవరం: మండలంలోని కొత్తాడ గ్రామ సచివాలయం పరిధిలోని సూరంపాలెం పంచాయతీలో రాజుపేటలొద్ది, వేమనాపల్లి, సూరంపాలెం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు.

పాండురంగ స్వామి ఆలయంలో తిరు కల్యాణం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో ఆదివారం రాత్రి తిరుకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు భక్తులు సతీసమేతంగా హాజరై కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు యియ్యణ్ణి కృష్ణస్వామి, నారాయణాచార్యులు, పండితులు కళ్యాణాన్ని రమ్యంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ శనివారం తీర్థ మహోత్సవం నిర్వహించి ఆదివారం రాత్రి గౌరీపమేశ్వరులను పురవీధుల్లో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉదయం నుంచి భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సందడిగా సీతారాముల తీర్థం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ శివారు చిట్టిబోయిన పాలెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీ సీతారాముల తీర్థం ఘనంగా జరిగింది. కోలాటం, చెట్టు భజన పోటీలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.